క్రీడాభివృద్ధికి సీఎం జగన్ కృషి

- మాజీ మంత్రి పేర్ని నాని
- కబడ్డీ పోటీల ప్రారంభోత్సవం

సీతానగరం: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని వెంకట రామయ్య (నాని) అన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జక్కంపూడి మెగాస్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా సోమవారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. మార్చ్ ఫాస్ట్ అనంతరం మాజీ మంత్రి నాని, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సీతానగరం – దివాన్ చెరువు మధ్య పోటీని టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం పేర్ని నాని మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినా, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తూ 2019లో 151 సీట్లు గెలుచుకున్నారని గుర్తు చేశారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ప్రజాసేవ, రాజకీయ చతురత, నిబద్ధత, పట్టుదల వంటివి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్‌లో ఉన్నాయన్నారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలన్నారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రీడాకారుల ప్రతిభ బయటకు తీసుకురావాలనే ఉద్దేశంతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దివాన్ చెరువు టీమ్‌లోని క్రీడాకారుడు పవన్‌ను మాజీ మంత్రి పేర్ని నాని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కరరావు, పిచ్చుకల రవికుమార్, పిచ్చుకల విజయ్ కుమార్ పాల్గొన్నారు. తొలిరోజు పోటీల్లో దివాన్ చెరువు, పురుషోత్తపట్నం జట్లు గెలుపొందాయి.


సీతానగరం హైస్కూల్లో కబడ్డీ పోటీలను తిలకిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని, జక్కంపూడి గణేష్


టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని, చిత్రంలో గణేష్

క్లుప్తంగా

జగనన్న పాలనలో మంచి భోజనం


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: సీఎం జగన్ పాలనలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నారని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. సోమవారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో కె.స్వామి నాయక్, హెచ్‌ఎం పుష్పలతతో కలిసి ఆమె పరిశీలించారు. సీఆర్పీ బేగం, ప్రసాద్, రమణ, చంటిబాబు పాల్గొన్నారు.

గోలింగేశ్వరస్వామికి విశేష పూజలు


బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో గోలింగేశ్వరస్వామి

బిక్కవోలు: ధనుర్మాసం సోమవారం సందర్భంగా బిక్కవోలు గోలింగేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని, తమ మొక్కులు తీర్చుకున్నారు.

ప్రచార రథానికి పూజలు


సింగవరంలో పర్యటిస్తున్న హిందూధర్మ ప్రచారం రథం

సీతానగరం: తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూధర్మ ప్రచార రథం సోమవారం సింగవరం, నాగరత్నం కాలనీల్లో పర్యటించింది. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, రథంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక రామాలయం వద్దకు రథం చేరుకుంది. సోమవారం ఉదయం సర్పంచ్ జానం పోసియ్య ఆధ్వర్యంలో ప్రచార రథం బయలుదేరింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్ట శ్రీనువాస్, చిర్ల పోశియ్య పాల్గొన్నారు.

జక్కంపూడి గణేష్‌కు అభినందనలు

మధురపూడి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్తగా జక్కంపూడి గణేష్ ఎంపిక కావడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ యువజన విభాగం విస్తృతమవడానికి గణేష్ ఎనలేని కృషిచేశారన్నారు. దానిలో భాగంగానే మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇది మంచి పరిణామమన్నారు. కోరుకొండ పంచాయతీ ఉప సర్పంచ్ నేతుల చిన్ని, పార్టీ నాయకులు బొరుసు బద్రి, యువజన విభాగం మండల అధ్యక్షుడు బొండాడ చందు, యువ నాయకులు ఉల్లి గణ, కర్రి అనిల్ అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

రాజానగరం: మండలంలోని పాలచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రవేశంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు తొలగించారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ విషయాన్ని ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకువెళ్లారు. దీనితో కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: స్థానిక పాతవూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనులు చేపడుతున్న కారణంగా 10వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ ఫీడర్‌పై ఉన్న పంచాయతీ ఏరియా, మెయిన్‌రోడ్డు, కెనాల్‌రోడ్డు, బుల్లియ్యగారితోట, షారోనుపురం, రాముడమ్మపేట ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1న కొమరిపాలెం గ్రామానికి చెందిన కొమరపు చిన్నబాబుని హత్య చేసిన నేరంలో ఎనిమిది మందిని సోమవారం కోర్టు ఎదుట హాజరుపరచగా వారికి 14 రోజులు రిమాండ్ విధించారని ఆయన చెప్పారు.

స్పందనకు మూడు వినతులు


వినతి పత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ అమ్మాజీ

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మూడు వినతులు వచ్చినట్టు తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. వడిశలేరు గ్రామానికి చెందిన పాతూరి వీర్రాజు తన పొలానికి చెందిన పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని, పెదరాయవరం గ్రామానికి చెందిన మల్లిమొగ్గల లక్ష్మి తన ఇంటి స్థలం ఆక్రమణకు గురైందని, సుభద్రంపేట గ్రామానికి చెందిన చెక్కపల్లి విష్ణుమూర్తి తనకు వృద్ధాప్య పింఛన్ అందించాలని వినతి పత్రాలు అందించారన్నారు. కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి బి.కృష్ణగోపాల్, పీఆర్ ఏఈ సీహెచ్ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది మంది మత్స్యకారుల జీవితాల్లో నూతన వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మత్స్యకారులకు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా సబ్సిడీపై మంజూరైన మోపెడ్స్, ఐస్‌బాక్సుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని రంగంపేట, పెదపూడి, బిక్కవోలు గ్రామాల పరిధిలో 8 మంది మత్స్యకారులకు సబ్సిడీపై మంజూరైన మోపెడ్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లాక్ డౌన్ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పేపకాయల వెంకటరమణ, కేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మోపెడ్స్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అలరించిన హరికథ

అనపర్తి: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా అనపర్తి శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఏడోరోజు సోమవారం హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమద్భాగవతంలోని గజేంద్ర మోక్షం ఘట్టాన్ని తిరుపతికి చెందిన వై.వెంకటేశ్వర్లు భాగవతార్ అద్భుతంగా ఆవిష్కరించి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. జి.నటరాజ్ తబల, ఎస్.మురళి కీ బోర్డుపై వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేతలి కృష్ణారెడ్డి, కర్రి బసివిరెడ్డి, కొవ్వూరి రామారెడ్డి, సమితి సభ్యులు తమలంపూడి చిన ఆదిరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి మునీశ్వరరెడ్డి పాల్గొన్నారు.


గజేంద్రమోక్షం ఘట్టాన్ని వివరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

ఆవాస ప్రాంత ప్రణాళికపై అవగాహన సమావేశం

బిక్కవోలు: కొంకుదురు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఆవాస ప్రాంత ప్రణాళికపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. కాంప్లెక్స్ కన్వీనర్ కొవ్వూరి అమ్మిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కేటాయించే బడ్జెట్ నిధులకు ఆవాస ప్రాంత ప్రణాళికలే కీలకమన్నారు. అందుకే ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక తయారీలో తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు చింతా వెంకటసోమిరెడ్డి, బీపీఎల్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో నగర సంకీర్తన

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా యోగా గురువు కర్రి రాణి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా భక్తులంతా కలిసి నగర సంకీర్తన చేస్తున్నారు. ఈ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

అనపర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలోని 1వ వార్డు పరిధిలోని గాంధీనగర్, శాంతిపురం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మూడున్నరేళ్లలో అనపర్తి పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.100 కోట్లకు పైబడిన సంక్షేమాన్ని ప్రజలకు నేరుగా అందించడంతో పాటు రూ.35.22 కోట్లతో అభివృద్ధి పనులు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ గ్రామానికి చెందిన నల్లమిల్లి రాజశేఖర్‌రెడ్డి(రాజా) ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కట్ చేశారు.

సంక్షేమ ప్రభుత్వంలో ప్రజలంతా సుభిక్షం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రభుత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. సుదీర్ఘ పాదయాత్ర అనంతరం సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు పేదలకు వరంలా మారాయని తెలిపారు. ముఖ్యంగా ప్రతి నెల 1వ తేదీ వేకువజామునే వలంటీర్లు తలుపు తట్టి పింఛన్లు అందించడంతో ముదిమి వయసులో ఉన్న వృద్ధులు అందిస్తున్న ఆశీస్సులు తనకు ఎంతో సంతృప్తినిస్తున్నాయన్నారు. పేదల సంక్షేమ కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ముందుగా అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గడప గడకూ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పార్టీ నాయకులు ఎస్‌సీఆర్ మురళి, భాస్కరరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకట రామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ తుమ్మా రాజేశ్వరి సత్తిబాబు, వార్డు సభ్యులు తేతలి రాధ వెంకటరెడ్డి, కొవ్వూరి విజయారెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, బొడ్డు సునీత తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నారంటూ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఆప్యాయంగా హత్తుకుని సంతోషం వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు రత్నం

కొంకుదురులో ముందస్తు సంక్రాంతి వేడుకలు


ముందస్తు సంక్రాంతి వేడుకలో గొబ్బెమ్మ పాటలు పాడుతున్న విద్యార్థినులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల ఆవరణలో భోగి మంట వేసి విద్యార్థినులు దాని చుట్టూ తిరుగుతూ గొబ్బెమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యాన్ని, సంప్రదాయాల్ని కొనసాగించాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొలుగూరి రామారెడ్డి, పడాల ఈశ్వరరెడ్డి, మమ్మద్ వలీషా, వాణి సులోచన, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ సంక్రాంతి పోటీలను ప్రోత్సహించాలి

పెదపూడి: సంప్రదాయ సంక్రాంతి పోటీలైన ముగ్గులు, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్‌లను అందరూ ప్రోత్సహించాలని పెదపూడి ఎస్‌ఐ పి.వాసు అన్నారు. జి.మామిడాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గులు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్‌ఐ వాసు, స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మండ రాజారెడ్డి, ఛత్రపతి శివాజీ, ఆర్‌ఏఆర్‌కే చౌదరి, వ్యాయామ ఉపాధ్యాయుడు వీర్రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ వాసు

శ్రీరంగపట్నంలో వైద్యశిబిరం

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్ ఆవరణలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన జాన్ వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 170 మంది వైద్యసేవలు అందించారు. శిబిరాన్ని సర్పంచ్ మద్దాల అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక టీచర్లు ఏహెచ్‌కే నాయక్, కె.మోహిని, వీఆర్ఓ కర్రి రాజు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

తొస్సిపూడిలో ట్రాఫిక్ కష్టాలు


తొస్సిపూడిలో నిలిచిపోయిన ట్రాఫిక్

బిక్కవోలు: తొస్సిపూడి సెంటర్లో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమరిపాలెంలో రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో తొస్సిపూడి లాకుల మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. అక్కడి వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు భారీ వాహనాలు అటుగా వస్తుండడంతో పదే పదే ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్ నియంత్రించడానికి అధికారులు ఎవరినైనా నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పేర్ని నానిని కలిసిన ఉప్పలూరి

రాజమహేంద్రవరం రూరల్: సీతానగరం మండలంలో క్రీడా పోటీలకు హాజరయ్యేందుకు వచ్చిన మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నానిని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పలూరి వీర వెంకట సత్యనారాయణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తొర్రేడులోని బాలాజీ టౌన్‌షిప్‌లో తన అనుచరులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు పార్టీ కార్యకలాపాలు, చేపట్టవలసిన పనులపై మాట్లాడారు. అనంతరం ఉప్పలూరి ఆధ్వర్యంలో భారీ ఊరేగింపుగా బయలుదేరి సీతానగరం వెళ్లారు. కార్యక్రమంలో ఉప్పలూరి రాము, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాటేజీల అద్దె పెంపు తగదు

రాజానగరం: తిరుమలలో భక్తులకు ఇచ్చే కాటేజీల అద్దెను ఒకేసారి భారీగా పెంచడం సరికాదని, తక్షణమే పెంచిన అద్దెను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. మండల శాఖ అధ్యక్షుడు పేపకాయల కాశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. పీఆర్ చౌదరి, మోది సత్తిబాబు, అడబాల గణపతిరావు, బోయిడి దుర్గారావు పాల్గొన్నారు.

కళాజాత ప్రదర్శన

రాజమహేంద్రవరం రూరల్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాజమహేంద్రవరం ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ పరిధిలో సోమాలమ్మగుడి సెంటర్, క్వారీమార్కెట్ ఏరియా సెంటర్‌లో సోమవారం కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం జీవితాలను ఏవిధంగా నాశనం చేస్తుందో కళాకారులు తెలియజేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో సోమవారం వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజానగరం నియోజకవర్గం స్థాయిలో జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకూ పది జట్లు తలపడ్డాయి. కోటికేశవరంపై నరేంద్రపురం, వెలుగుబందపై గాడాల విజయం సాధించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ నాలుగు, ఆ తర్వాత రాత్రి వరకూ 6 మ్యాచ్‌లు జరిగాయి. చినకొండేపూడి – కాపవరం, కోరుకొండ – చక్రద్వారబంధం, నరేంద్రపురం – చక్రద్వారబంధం, కోటికేశవరం – చినకొండేపూడి, శ్రీరంగపట్నం – నల్లగొండ, దోసకాయలపల్లి – కోటి జట్ల మధ్య పోటీ హోరాహోరీగా జరిగింది. కాగా... ఈ పోటీల్లో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులు ఆడుతున్నారు. గాడాల జట్టులో ఆటగాడైన వెంకట శివ ఆంధ్రప్రదేశ్ తరపున ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో ఆడి రాణించాడు. సీతానగరం జట్టులో ఉన్న ఎం.దుర్గాప్రసాద్ ఇటీవల చెన్నైలో నిర్వహించిన పోటీల్లో రాణించాడు. కాగా.. ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.6 వేలు, ఆరో బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నారు. 45 గ్రామాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులను 4 గ్రూపుల్లో 32 టీములుగా విభజించారు. రిఫరీలుగా ఏ. శ్రీనివాసరావు, ఏ.సుధాకర్, సత్యప్రసాద్, ఇబ్రహీం, సూర్యమోహన్, సీతాపతి, గణేష్, నాగరాజు వ్యవహరించారు.


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నేటినుంచి డివిజన్లలో సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పర్యవేక్షణలో నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో మంగళ, బుధ, గురువారాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఈ వివరాలను సోమవారం ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి విలేకరులకు వెల్లడించారు. మూడు రోజులపాటు డివిజన్లలో పార్టీ ఇన్‌చార్జులు, మహిళా నాయకుల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆర్ట్సు కళాశాల మైదానం జగనన్న సంక్రాంతి సంబరాలను ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, లేడీస్ ఫ్యాషన్‌షో, భరతనాట్యం, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం జగనన్న సంక్రాంతి సంబరాలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, మాజీ కార్పొరేటర్లు మజ్జి నూకరత్నం, బాపన సుధారాణి, పార్టీ మహిళా నాయకులు సయ్యద్ హసీనా బేగం, కొత్త విజయ రాజ్యలక్ష్మి, అను యాదవ్, దుంగా మంగ, కృష్ణవేణి, అనంతలక్ష్మి, మార్గాని సుశీల పాల్గొన్నారు.


సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పోలు విజయలక్ష్మి తదితరులు